

తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటూ...

వడగండ్లు..రైతుకు కడగండ్లు

వరి పైరుకు తీవ్ర నష్టం నేలరాలిన మామిడి పిందెలు

ప్రజాశక్తి - బాలాయపల్లి, శ్రీకాళహస్తి రూరల్

అకాల వర్షం రైతు నడ్డి విరిచింది. భారీ వానకు తోడు వడగండ్లు పడడంతో కంకులతో కూడిన వరి పైరు నేలవాలింది. కోసిన వరి పైరు తడిచిపోయి మొక్కలు వచ్చేలా ఉంది. మామిడి మొక్కలు నేలవాలాయి. పూత, పిందెలు రాలిపోయాయి. పిడుగుపాటుకు మూడు ఆవులు, రెండు గొర్రెలు మృతిచెందాయి.

ఆరుగాలం శ్రమించిన రైతుకు కన్నీరే మిగిలింది. రైతు కష్టం వర్షార్పణం అయ్యింది. శుక్ర, శనివారాల్లో కురిసిన వర్షానికి చేతికొచ్చిన పంట నీటిపాలయ్యింది. ఏపుగా పూచిన మామిడిపూత, కాయలు నేలరాలాయి. మండలంలోని బాలాయపల్లి, పాకపూడి, గొట్టకాడు, మన్నూరు, నిండలి, వెంగమాంబపురం, యాచవరం, నిడిగల్లు, పాపిరెడ్డిపల్లి గ్రామాలోల 260 ఎకరాల్లో వరి పైరు నీట మునిగింది. 70శాతం పైగా కంకులు రాలిపోయి నీటిలో కలిసిపోయాయి. 150 ఎకరాల్లో మామిడికి నష్టం వాటిలింది. పిడుగు పడి పశువుల పాకలు, కోళ్ల షెడ్డులు ధ్వంసమయ్యాయి. ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాల వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారంలో కొన్ని గ్రామాలు ఉన్నాయి.

నష్టాన్ని గుర్తిస్తున్నాం : ఎం.శిరీష, బాలాయపల్లి

మండలంలో 6,850 ఎకరాల్లో వరి సాగు చేశారు. 30 శాతం వరి కోశారు. వర్షానికి కల్లాల్లో వడ్లు తడిస్తే గుర్తించి ప్రభుత్వ సిఫార్సు మేరకు నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటాం.

శ్రీకాళహస్తి రూరల్ : మండలంలోని పలు పంచాయతీల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వరిపంట నేలపాలయ్యింది. పిడుగులు పడడంతో శ్రీకాళహస్తి రూరల్ అమ్మచెరువు గ్రామంలో మూడు పశువులు మృతిచెందాయి. మామిడి మొక్కలు నేలకూలాయి. ఈ విషయమై శ్రీకాళమస్తి మండల వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డిని వివరణ కోరగా వర్షం కురిసిన మాట వాస్తవమేనని, క్షేత్రస్థాయికి వెళ్లి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించేలా నివేదికలు పై అధికారులకు పంపిస్తామని తెలిపారు.

అమ్మచెరువులోని రైతు పొలంలో నేలకూలిన మామిడి మొక్కలు


నేలవాలిన వరిపైరు

రూ.79 కోట్లతో స్మార్ట్ ఐకానిక్ భవనం

బడ్జెట్‌లో నిధులు గగనం

ముందుకు సాగని నిర్మాణ పనులు

ఇంజనీరింగ్ విభాగంలో 'బినామీ'లు

ఒకరిద్దరికే నగరాభివృద్ధి పనులన్నీ..

చిన్నచిన్న కాంట్రాక్టర్లు బిల్లులు రాక లబోదిబో

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

తిరుపతి స్మార్టు ఐకానిక్ భవన నిర్మాణం త్వరితగతిన 18 నెలల్లో పూర్తి చేసి కార్పొరేషన్‌కు అందజేయాల్సి ఉంది. అయితే నిధుల లేమితో పనులు ముందుకు సాగడం లేదని సమాచారం. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లోనూ నిధులు కేటాయించకపోవడంతో అనుకున్నట్లుగా నిర్మాణం పూర్తవుతుందా? లేదా? అన్నది అనుమానమే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక గ్రాంట్లు ఏమీ రాకపోవడంతో కేవలం 'పన్నుల' ఆధారంగానే నగరం అభివృద్ధి సాగుతోంది.

గత ఏడాది ఆగస్టులో తిలక్‌రోడ్డులోని పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం స్థానంలో ఐకానిక్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. స్మార్ట్‌సిటీ పథకంలో రూ.81 కోట్లతో టెండర్లు పిలిచారు. చెన్నయ్‌కి చెందిన ఆర్ఆర్ తులసీ బిల్డర్స్ కంపెనీ రూ.71 కోట్లకే ఐదు అంతస్తుల స్మార్ట్ ఐకాన్ భవనాన్ని నిర్మిస్తామని పనులు చేపట్టింది. గత మూడేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్మార్ట్‌సిటీ నిధులు రావడం లేదు. ఐకాన్ భవనం పూర్తి చేయడానికి 19 నెలల గడువే కార్పొరేషన్ అధికారులు ఇచ్చారు. అయితే నిధుల లేమితో పనులు నత్తనడకన నడుస్తున్నాయి. ఇప్పటికే స్మార్ట్‌సిటీ పథకంలో చేసిన బిల్లులు రాక కాంట్రాక్టర్లు చాలా వరకూ పనులు నిలిపేశారు. దాదాపు 25-30 కోట్లపైనే బిల్లులు కాంట్రాక్టర్లకు రావాల్సి ఉందని సమాచారం.

తిరుపతి కార్పొరేషన్ ఖజానా అంతంతమాత్రంగానే ఉంది. కౌన్సిల్ వచ్చిన తరువాత బడ్జెట్‌తో సంబంధం లేకుండా అభివృద్ధి పనులు చేయడానికి జనరల్ ఫండ్స్‌లో పనులు చేపట్టారు. వారికి సంబంధించిన బిల్లులు దాదాపు 20 కోట్లు ఉన్నాయని సమాచారం. దీనికితోడు మాస్టర్‌ప్లాన్ రోడ్లు ఆరు చేపట్టారు. వాటికి 30 కోట్లు ఖర్చవుతుంది. రోడ్డు వెడల్పు చేయడం, కొత్త సిమెంట్ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, వీధిలైట్లుతో పాటు డివైడర్లు వేస్తున్నారు. మాస్టర్‌ప్లాన్ రోడ్లు వేసేందుకు కౌన్సిల్ తీర్మానం చేసింది. ఈ నేపథ్యంలో స్మార్ట్ ఐకానిక్ భవన నిర్మాణ పనులకు నిధుల లేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పాత మెటర్నిటీ ఆస్పత్రి లోనికి కార్యాలయాన్ని మార్చడానికి దాదాపు కోటి పైనే నిధులు ఖర్చు చేశారు. కేవలం ఆస్తిపన్నులు, ప్రకటనలు, భవన నిర్మాణ అనుమతులు ఫీజుల ద్వారానే కార్పొరేషన్ నెట్టుకొస్తోంది.

బడా కాంట్రాక్టర్‌లకే బిల్లులు

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బడా కాంట్రాక్టర్లకు మాత్రమే బిల్లులు మంజూరవుతున్నాయన్న విమర్శలున్నాయి. చిన్న చిన్న కాంట్రాక్టర్లు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా కాళ్లరుగుతున్నాయే తప్ప, కాసులు రావడం లేదని వారు వాపోతున్నారు. వీరు బిల్లులు పెట్టి ఏడాదవుతున్నా అతీగతీ లేదు. బడా కాంట్రాక్టర్లు కోట్లల్లో బిల్లులను బినామీల పేరుతో రాజకీయ పలుకుబడి ఉపయోగించి తీసుకుంటున్నారని సమాచారం. గతంలో ముందుగా పనులు చేసిన వారికి ముందుగా బిల్లులు ఇస్తూ సీనియారిటీ ప్రకారం ఇచ్చేవారు. ఇపుడు ఆ పద్ధతి లేదు. 'కమీషన్' ముట్టజెప్పిన వారికే బిల్లులు మంజూరవుతున్నాయి. దీంతో చిన్న చిన్న వ్యాపారులు బిల్లులు రాక కార్పొరేషన్ అధికారులు పిలిచే పనులు చేయడానికి ముందుకు రావడం లేదు. బడా కాంట్రాక్టర్లు పనులు తీసుకుని 'బినామీ'ల పేరుతో బిల్లులు పొందుతున్నారు. దీంతో అభివృద్ధి పనులన్నీ ఒకరిద్దరు కాంట్రాక్టర్ల చుట్టూనే ఉంటోంది. ఇంజినీరింగ్ విభాగంలో కొందరు బినామీ కాంట్రాక్టర్లుగా వ్యవహరిస్తున్నారు. ఇటు అధికారిగా, అటు బినామీ కాంట్రాక్టర్‌గా ద్విముఖపాత్ర పోషిస్తున్నారు. ఉన్నతాధికారులు సైతం వీరి పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

రహదారి సమస్యపై 'రోడ్డెక్కారు'

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్

దీర్ఘకాలిక సమస్య... అనేకమార్లు అధికారులకు మొరపెట్టుకన్నారు. న్యాయం చేయకపోవడంతో రహదారి సమస్యపై చిందేపల్లి గ్రామస్తులు మరోసారి రోడ్డెక్కారు. అయితే గ్రామస్తులపై పోలీసులు దాష్టీకం ప్రదర్శించి లాఠీఛార్జితో బెదిరించి పోలీసు స్టేషన్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి.

రాచగున్నేరి పంచాయతీలోని ఎలక్ట్రో స్టీల్ క్యాస్టింగ్ లిమిటెడ్ కర్మాగారం ఉంది. ఈ కర్మాగారం లోపల నుంచి ఏర్పేడు మండలం చిందేపల్లి గ్రామానికి వెళ్లడానికి ఎన్నో సంవత్సరాల నుంచి రవాణా సౌకర్యం ఉండేది. గత కొంతకాలంగా కర్మాగారం యాజమాన్యం ఈ రోడ్డు కర్మాగారానికి చెందినదని, గ్రామస్తులు ఫ్యాక్టరీ పక్కన వేసిన రోడ్డులో వెళ్లాలని హుకుం జారీ చేసింది. కర్మాగారం లోపల ఉన్న రోడ్డు యాజమాన్యందేనని పైస్థాయి అధికారుల నుంచి ఉత్తర్వులు రావడంతో శనివారం ఆ రహదారిని మూసివేసింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు తమకు న్యాయం చేయాలని, తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం పునరుద్ధరించాలని వేడుకొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం ఉరిశిక్ష పడే ఖైదీని సైతం చివరి కోరిక అడిగి మరీ ఉరి తీస్తారని, గ్రామస్తులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఎన్నో ఏళ్లుగా ఉన్న రోడ్డును ఎలా మూసివేస్తారని యాజమాన్యాన్ని నిలదీశారు. ఈ రోడ్డు చిందేపల్లి గ్రామం పుట్టినప్పటి నుంచి ఉందన్నారు. గ్రామానికి వెళ్లే రోడ్డు కంపెనీ మధ్యలో ఉండడంతో ఈ రోడ్డును ఈసిఎల్ కంపెనీ వారు కోరడంతో కలెక్టర్ గ్రామస్తులతో చర్చించకుండా ఈ రోడ్డు కంపెనీకే చెందుతుందని ఉత్తర్వులు జారీ చేశారన్నారు. గ్రామస్తులతో చర్చించి, వారి కోరిక మేరకు అన్ని వసతులతో కూడిన తారు రోడ్డును ఏర్పాటు చేయాలని, రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీపాలు ఉండేలా చూడాలని కోరారు. కర్మాగార యాజమాన్యం గ్రామస్తులకు ప్రత్యామ్నాయ రోడ్డును ఏర్పాటు చేస్తామని చెబుతున్నారని, ఇంతవరకూ పూర్తిస్థాయిలో చేయలేదన్నారు. ఖచ్చితంగా తారు రోడ్డు నిర్మించిన తరువాతనే పాత రోడ్డును మూసివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రంగయ్య, పెనగడం గురవయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు.

చిందేపల్లి గ్రామస్తులకు అండగా..

పారిశుధ్య కార్మికులకు న్యాయం చేయాలి

జీతాలివ్వనందునే మృతిచెందాడని ధర్నా

మున్సిపల్ కమిషనర్ స్పందించాలని వినతి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

అనారోగ్య కారణాలతో పారిశుధ్య కార్మికుడు శనివారం మృతిచెందాడు. మున్సిపల్ కమిషనర్ గత నాలుగైదు నెలలుగా జీతాలివ్వనందునే ఆస్పత్రిలో వైద్యం తీసుకోలేదని, డబ్బుల్లేని దయనీయ స్థితిలో చావును వెతుక్కుంటూ వెళ్లాడని తోటి కార్మికులు మండిపడుతున్నారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ సకాలంలో జీతాలు వేసి ఉంటే మోపూరు రామయ్య చనిపోయేవాడు కాదని, మున్సిపల్ కమిషనర్ బాధ్యత వహించాలన్నారు. గ్రేడ్ వన్ మున్సిపాలిటీ అయినప్పటి నుంచి కమిషనర్ కార్మికుల పట్ల వివక్ష చూపిస్తూ డిసెంబర్‌నెల నుంచి జీతాలివ్వలేదని వాపోయారు. జనవరి నెలలో జీతాల కోసం ఆందోళన చేశామని, చర్చలు జరిపి ఇస్తామని చెప్పినా స్పందన లేదన్నారు. అడిగిన వారిని వేధిస్తూ చివరకు ఒక నెల జీతం వేశారన్నారు. మూడు నెలలుగా జీతాల్లేని కారణంగా అప్పుల వాళ్లకు సమాధానం చెప్పుకోలేక రెండు వారాల క్రితం దండోలు శ్రీనివాసులు ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. 'శవంతో ధర్నా' చేసినా కమిషనర్‌కు చీమ కుట్టినట్లు లేదన్నారు. ఈ చావు మరవకముందే గాంధీనగర్లో మోపూరు రామయ్య అనారోగ్యంతో వైద్యం చేయించుకోలేక మృతిచెందాడన్నారు. కార్మికులంతా కలిసి చందాలు వేసుకుని తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి సోమవారం తీసుకెళదామనుకునే లోపే ఇలా జరిగిందని వాపోయారు. ఇకనైనా కమిషనర్ స్పందించి మానవతా దృక్పథంతో తమకు ఇవ్వాల్సిన వేతన బకాయిలను ఇచ్చి తమ జీవితాలను కాపాడాలని వేడుకొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జోగి శివకుమార్, మున్సిపల్ తిరుపతి జిల్లా కార్యదర్శి బి.గోపీనాథ్, బివిరమణయ్య, బి.మురళి, శాంతివర్ధన్, ప్రసాద్, మణి, సంపూర్ణమ్మ, ప్రభావతి, పోలమ్మ, నారాయణమ్మ పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తూ...

ఇక 'కార్పొరేట్'దే రాజ్యం

ప్రజాదృష్టి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

విద్యావ్యవస్థ పరిరక్షణ కోసం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు పోరాటాల రూపంలోనూ, శాసనమండలిలోనూ 'పీడీఎఫ్' తరపున పోరాడుతూనే ఉన్నారు. గత 16 ఏళ్లుగా ప్రభుత్వ విద్యాసంస్థలు బాగున్నాయంటే పీడీఎఫ్ ఎంఎల్‌సిలే కారణం. తాజాగా జరిగిన ఎంఎల్‌సి ఉపాధ్యాయ ఎన్నికల్లో కుతంత్రాలతో 'వైసిపి' చేజిక్కించుకుంది. కార్పొరేట్ విద్యాసంస్థలను బలపరిచింది. ఇక వాళ్లుచెప్పిందే వేదం. ఉపాధ్యాయులకు ఏ సమస్య వచ్చినా గతంలో పీడీఎఫ్ ఎంఎల్‌సిలకు తమ గోడు విన్నవించుకునేవారు. వారి సమస్యలను శాసనమండలిలో ప్రస్తావనకు తెచ్చేవారు. విశ్లేషణాత్మకమైన చర్చ జరిగేది. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ప్రభుత్వ బడుల పరిరక్షణలోనూ వీరు కీలకంగా వ్యవహరించేవారు. పిఆర్‌సి అమలు చేయాలని, సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ ఇవ్వాలని, పోస్టులు భర్తీ చేయాలని పిడిఎఫ్ ఎంఎల్‌సిలు శాసనమండలిలో జగన్ సర్కార్‌ను నిలదీస్తూ వచ్చారు. 'చలో విజయవాడ' నిర్వహించి నిర్బంధాలను ఎదిరించి జగన్‌కు వణుకు పుట్టేలా చేశారు. పీడీఎఫ్ ఎంఎల్‌సిల అడ్డు తొలగించుకోవాలని జగన్ సర్కార్ కుట్ర పన్నింది. ఓ దశలో శాసనమండలినే రద్దు చేయాలని యోచించింది. తమ పార్టీ రాజకీయ నిరుద్యోగులకు అవకాశం కల్పించేందుకు ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఎంఎల్‌సి ఎన్నికల్లో 'పీడీఎఫ్' భరతం పట్టాలని కక్షపూరితంగా జగన్ వ్యవహరించారు. ఓట్ల చేర్పింపు నుంచి అధికార యంత్రాంగానికి బాధ్యత అప్పగించారు. వాలంటీర్లను కార్యకర్తల్లా వాడుకున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంఎల్‌ఎలకు, ఎంపిలకు టార్గెట్లు ఇచ్చారు. 'ఎలాగైనా గెలిచి తీరాలి' అని హుకుం జారీ చేశారు. దీంతో అధినేత మన్ననలు పొందేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు దొంగ ఓట్లను చేర్పించడంలో పోటీ పడ్డారు. సక్సెస్ అయ్యారు. అయితే పీడీఎఫ్ కార్యకర్తలు, మీడియా జోక్యంతో వీరు చేర్పించినవి చాలావరకూ 'ఫేక్ ఓట్ల'ని తేల్చారు. పోలింగ్ రోజు రిగ్గింగ్‌కు సైతం పాల్పడ్డారు. గొడవలు సృష్టించేందుకు సిద్ధపడ్డారు. విందులు, వినోదాలు, ప్రలోభాల నడుమ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లపై కర్ర పెత్తనం చేశారు. ఓటుకు నోటు పేరుతో ఒక్కో కళాశాలకు, ప్రైవేట్ స్కూళ్లకు గుత్తగా 5-10 లక్షలు నజరానా ప్రకటించారు. ఒక్కో ప్రైవేట్ టీచర్‌కు ఐదువేల రూపాయల చొప్పున అందజేశారు. గిఫ్ట్ ప్యాక్‌లు పంపిణీ చేశారు. ప్రభుత్వ టీచర్లు మాత్రం అధికార పార్టీ గిఫ్ట్‌లను తిరస్కరించారు. తమ తరపున తమ పీడీఎఫ్ అభ్యర్థులే పెద్దల సభకు వెళతారని నికార్సుగా ఓటేశారు. కార్పొరేట్ యాజమాన్యాల కనుసన్నల్లో మెలిగిన ప్రైవేట్ టీచర్లు ఉద్యోగ భద్రత ఉండదని భయపడి వారు చెప్పినట్లే చేశారు. అయినా వైసిపి టీచర్ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలవలేకపోయారు. రెండో ప్రాధాన్యత ఓటు లెక్కింపుతో పీడీఎఫ్ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిపై 1055 మెజార్టీతో గట్టెక్కారు. ఏమైనప్పటికీ ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలపైనా, ప్రైవేట్ టీచర్ల సమస్యలపైనా పెద్దల సభలో గళమెత్తేవారు తూర్పు రాయలసీమలో లేకుండా పోయారు. ప్రతి ప్రభుత్వ ఉపాధ్యాయునిలోనూ ఇదే వేదన.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి : శ్రీలక్ష్మి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

బాలల హక్కులను తెలియజేసి సమాజంలో ఉత్తమ పౌరులుగా పిల్లల్ని తీర్చిదిద్దాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు శ్రీలక్ష్మి ఉద్ఘాటించారు. పాఠశాలలు, బాలసదన్లు, జువనైల్స్ పర్యటనలో జీవనోపాధి కల్పనకు పలు సూచనలు చేశారు. శనివారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు బాలబాలికలకు విద్యాహక్కు, పాఠశాలల్లో వసతులు, సౌకర్యాలు కల్పించడం, బాల్య వివాహాల నిషేధం, చిన్న పొరబాట్లతో శిక్ష అనుభవిస్తున్న వారికి మనోధైర్యం కల్పించడం, సమాజంలో మంచి స్థాయిలో నిలబడేలా చేయడం బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ విధి అన్నారు. బాలల హక్కులకు భంగం కలిగితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏప్రిల్ మూడో తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయని, సౌకర్యాల కల్పనపై అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

కాఫీ పొడితో 'అంబేద్కర్' చిత్రం రూపకల్పన

తిరుపతి టౌన్ : కాఫీపొడితో స్పెషల్ ఆర్ట్స్ ద్వారా 60 అడుగుల వెడల్పు, 130 అడుగుల పొడవుతో తిరుపతి నగరవాసి చిరంజీవి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రాన్ని ఎన్నుకుని గీయడం అభినందించదగిన విషయమని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి పెయింట్ బ్రష్‌ను చిరంజీవికి అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని ఎన్నుకోవడం హర్షించదగిన విషయమని, ప్రపంచంలోనే అతి పెద్ద అంబేద్కర్ విగ్రహ చిత్రపటంగా నిలుస్తుందన్నారు. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కే అవకాశం ఉందన్నారు. స్పెషల్ ఆర్ట్స్‌ను ప్రోత్సహించేలా కలెక్టరేట్‌లో 20 రోజుల పాటు చిరంజీవి శ్రమించి రూపొందించనున్నారని తెలిపారు. రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.



పట్టభద్రుల ఎంఎల్‌సిగా కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఉమ్మడి ప్రకాశం- నెల్లూరు - చిత్తూరు నియోజకవర్గ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో ప్రాధాన్యతా ప్రకారం ఓట్ల లెక్కింపులో టిడిపి మద్దతుదారు కంచర్ల శ్రీకాంత్ గెలుపొందారు. రిటర్నింగ్ అధికారి ఎం.హరినారాయణన్ డిక్లరేషన్‌ను శనివారం అందించారు. గురువారం ఉదయం చిత్తూరు ఆర్‌విఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో 16న ఉదయం 8 గంటల నుండి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యింది. శనివారం తెల్లవారుజామున 2 గంటల వరకు కొనసాగింది. ఎలిమినేషన్ ఓటింగ్ ప్రక్రియతో వైసిపి మద్దతుదారు శ్యాంప్రసాద్‌రెడ్డి పేర్నాటిపై 34,110 ఓట్ల ఆధిక్యంతో కంచర్ల శ్రీకాంత్ గెలుపొందినట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. మొత్తం 2,48,360 ఓట్లకు గాను కంచర్ల శ్రీకాంత్‌కు 1,24,181 ఓట్లు, శ్యాంప్రసాద్ రెడ్డి సేర్నాటికి 90,071 ఓట్లు వచ్చాయి.



కంచర్ల శ్రీకాంత్ చౌదరి బయోడేటా

పేరు : కంచర్ల శ్రీకాంత్ చౌదరి **తండ్రిపేరు :** కంచర్ల రామయ్య

స్వగ్రామం : కందుకూరు **పుట్టినతేదీ :** 25-7-1980

విద్యార్హతలు : బిటెక్, ఎంబిఎ (2005లో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో బిటెక్ చేశారు. 2017లో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఎంబిఎ పూర్తి చేశారు. 2018లో యూనివర్సిటీ ఆఫ్ ఆసియా నుంచి డాక్టరేట్ పొందారు.)

ప్రస్తుతం : ప్రకాశం ఎడ్యుకేషన్ గ్రూప్ డైరెక్టర్, కంచర్ల ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఘనంగా అన్నమయ్య సంకీర్తనల గోష్ఠిగానం

తిరుపతి సిటీ : శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల 520వ వర్ధంతి మహోత్సవాలు టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిరంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఆలపించిన సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానం ఆకట్టుకుంది. ఉదయం 9 గంటలకు అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు, స్థానిక కళాకారులు కలిసి దినము ద్వాదశి, సప్తగిరి సంకీర్తనలను రాగయుక్తంగా ఆలపించారు. అనంతరం హారతి, మహానివేదన చేపట్టారు. మహతి కళాక్షేత్రంలో శనివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఎస్వీ సంగీత నత్య కళాశాల అధ్యాపకులు వెంకటేశ్వర్లు భాగవతార్ హరికథ పారాయణం చేయనున్నారు. రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు ఎస్వీ సంగీత నత్య కళాశాల అధ్యాపకులు హరనాథ్ భరతనాట్యం ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టుసంచాలకులు డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ పాల్గొన్నారు.

భక్తిభావాన్ని పంచిన అఖండ హనుమాన్ చాలీసా పారాయణం

తిరుమల : నాదనీరాజనం వేదిక, ఆస్థాన మండపంలో శనివారం జరిగిన అఖండ హనుమాన్ చాలీసా పారాయణం భక్తిభావాన్ని పంచింది. శనివారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన ఈ పారాయణం ఆదివారం ఉదయం వరకు 24 గంటల పాటు జరగనుంది. టిటిడి బోర్డు మాజీ సభ్యులు, యుగతులసి ఫౌండేషన్ ఛైర్మన్ శివ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 500 మంది భక్తులు ఈ పారాయణంలో పాల్గొన్నారు.

నేడు శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

తిరుపతి సిటి : తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు మార్చి 19న అంకురార్పణ నిర్వహించనున్నారు. మార్చి 20 నుండి 28వ తేదీ వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం సాయంత్రం 6.30 నుండి రాత్రి 7.15 గంటల వరకు సేనాధిపతి ఉత్సవము, మేదిని పూజ, మత్సంగ్రహణం, శాస్త్రోక్తంగా అంకురార్పణం జరుగనుంది.

శాశ్వత పరిష్కారం వైపు ట్రాన్స్ డిసిప్లినరీ పరిశోధనలు

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో శాశ్వత పరిష్కారం వైపు ట్రాన్స్ డిసిప్లినరీ పరిశోధనలు కొనసాగుతాయని ఉపకులపతి ఆచార్య కే.రాజారెడ్డి పేర్కొన్నారు. శనివారం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో విశ్వవిద్యాలయానికి యూజీసీ ట్రాన్సిట్ డిసిప్లినరీ పరిశోధనలో భాగంగా రూ.63 లక్షల ప్రాజెక్టును మంజూరు చేసిందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా విద్యార్థులకు, పరిశోధనా విద్యార్థులకు, అధ్యాపక బందానికి ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ పైన సర్టిఫికెట్ కోర్స్ అందించి, అందుకుగాను అనేక వర్క్ షాప్‌లు నిర్వహించడం జరిగింది. ఈ కోర్సు పూర్తి చేసుకున్న అనంతరం వివిధ విభాగాలకు చెందిన అధ్యాపక విద్యార్థునులు 6 టీములుగా ఏర్పడి, కౌమార దశకు సంబంధించిన సమస్యలపై పరిశోధన చేయడానికి ప్రతిపాదనలు సమర్పించారు. ఈ పరిశోధనల ఫలితంగా యుక్త వ యస్కుల కోసం ఐసిటి మాడ్యూల్స్ తో పాటుగా రక్తహీనత, పిసిఒడి , జంక్ ఫుడ్ యొక్క దుష్పరిణామాలు, ఓవరాల్ వెల్ బీయింగ్ వంటి అంశాలపై చైతన్యం కలిగించే మొబైల్ యాప్స్‌ని తయారు చేయడం జరిగింది. ఈ పరిశోధన ఫలితాలను సమీక్షించే నిమిత్తమై సావేరి సెమినార్ హాల్లో డిసిమినేటన్ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజారెడ్డి, ప్రొఫెసర్ మురళీధర్, ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఉమా, వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజిని, ట్రైకా ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, కో ఇన్వెస్టిగేటర్స్ ప్రొఫెసర్ ఉమామహేశ్వరి దేవి, ప్రొఫెసర్ ఉష, ఇతర అధ్యా పకులు, పరిశోధన విద్యార్థునులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్వీయూ అంతర్జాతీయ అటవీ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఈ నెల 21వ తేదీ అంతర్జాతీయ అటవీ దినోత్సవం పురస్కరించుకుని వక్ష శాస్త్ర విభాగంలో మూడు రోజులు 19 నుండి 21వ తేదీ వరకు వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఉప కులపతి ఆచార్య కే రాజారెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు, పరిశోధక విద్యార్థులకు, అధ్యాపకులకు " అడవులు మరియు ఆరోగ్యము" అనే అంశం మీద అవగాహన కలిగించుటకు, వీరిని కర్యోన్ముఖులను చేయుటకు అడవులకు సంబంధించిన వివిధ అంశాలలో వ్యాసరచన, వక్తత్వము, కళాకతులు గీయటంలలో పోటీలు నిర్వహించుచున్నారు. ఇందులో భాగంగా ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య రాజారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహిళ సాధికారత డీన్ ఆచార్య సావిత్రమ్మ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, వార్డెన్‌లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో ఉపశమనం

ప్రజాశక్తి-కోట: ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు వాతావరణం ఒక్కసారిగా చల్లబడి రెండురోజులుగా వర్షాలు పడుతుండడంతో కాస్త ఉపశమనం లభించింది. అయితే మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని, పంటలు చేతికొచ్చే సమయం కావడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని, పంట నష్టపోకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

రైతులకు త్వరలో పట్టాలు

ప్రజాశక్తి-రేణిగుంట: మండలంలోని జి.పాలెం రైతులకు త్వరలో పట్టాలు అందజేస్తామని వైసీపీ మండల ఇన్‌ఛార్జ్ బియ్యపు పవిత్ర రెడ్డి తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ బాలాజీ దష్టికి ఆమె జి. పాలెం రైతుల సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా వ్యవసాయం చేసుకుంటున్న 20 కుటుంబాల రైతుల పంటపొలాలకు భూ పట్టాలు లేవని, సమస్యను జి.పాలెం రైతులు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి దష్టికి తీసుకెళ్లగా ఆయన సమస్యను పరిష్కరించే విధంగా కార్యాచరణ చేపట్టాలని తనను ఆదేశించినట్లు తెలిపారు. రైతులు సమస్యలు పరిష్కరించి వారికి పట్టాలను అందజేస్తామని జాయింట్ కలెక్టర్ బాలాజీ హామీ ఇచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట మండల ఎంపిపి కలపాటి హరిప్రసాద్ రెడ్డి, దయాకర్ రెడ్డి, దాము, యోగేశ్వర్ రెడ్డి, శంకర్ రెడ్డి, రాజశేఖర రెడ్డి, రమణ రెడ్డి, విజయ్ భాస్కర, లక్ష్మమ్మ, వెంకట్ రమణ రెడ్డి, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు అవగాహన

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు విజయ్ కుమారి ఆధ్వర్యంలో శనివారం తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరం బాలికల జూనియర్ కళాశాల మొదటి సంవత్సర ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ప్రవేశానికి సంబంధించిన పలు అంశాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నూతన తహశీల్దార్‌గా నరసింహారావు

ప్రజాశక్తి-వాకాడు: మండల నూతన తహశీల్దార్‌గా ఎస్‌వి నరసింహారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎఫ్ఎసి తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న ఎం.సారంగపాణి స్థానంలో ఈయన నియమింపబడ్డారు. ఈయన ముందు సిసిఎల్ఎ లో విధులు నిర్వహిస్తుండేవాడు. నూతన తహశీల్దార్‌ను కార్యాలయ సిబ్బంది ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఎస్వీ నరసింహారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కార్యాలయ సిబ్బంది చేసే పనుల్లో కచ్చితత్వం పాటించాలని తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ సారంగపాణి, ఆర్ఐ సెల్వరాజ్, సీనియర్ సహాయకులు జి సుధా, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాంస్కృతిక కళా గర్జనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తిరుపతి అర్బన్: రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ స్థాపించబడిన సమతా సైనిక దళ్ తిరుపతి శాఖ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక బాలాజీ కాలనీ లోని మహాత్మా రావు పూలే విగ్రహం నుండి గాంధీ రోడ్, తిలక్ రోడ్డు మీదుగా ఇందిరా మైదానానికి ర్యాలీకి సమతా సైనిక దళ్ తిరుపతి శాఖ శనివారం పిలుపునిచ్చారు. మారుమూడి విక్టరీ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ షాన్ రేంజర్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాతో మహిళలకు అభివృద్ధి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రూరల్ మండలం రామకష్ణాపురం గ్రామ పంచాయతీలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ విరిత ఆధ్వర్యంలో సచివాలయంలో డ్వాక్రా మహిళలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విరిత మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళలు అభివద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరాలో డ్వాక్రా సంఘాల సభ్యుల ఖాతాల్లో జమ కాబోయే నగదు మొత్తాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ మిత్రాలు, డ్వాక్రా సంఘ మహిళలు, వరలక్ష్మి, మీనా, సంపూర్ణమ్మ, కమలమ్మ, రాజమ్మ, మునెమ్మ, వైసిపి నాయకులు దేవేందర్ రెడ్డి, జి చంద్ర, సుధాకర్ రెడ్డి, ముని, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

ఎస్వీయూలో ఎమ్మెల్సీ విజయోత్సవ సంబరాలు

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని అకాడమిక్ కన్సల్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వర్సిటీ పరిపాలన భవనం ఎదుట తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి విజయాన్ని తాత్కాలిక అధ్యాపకులు బాణసంచా పేల్చి, స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. 23 వ వార్డు కౌన్సిలర్ వెంకటేశ్వర్లు, వర్సిటీ అకాడమిక్ కన్సల్టెంట్ సంఘం ప్రెసిడెంట్ కిషోర్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'శ్రీరామ'లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడీ మార్గంలోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం 2023ను మొదటి సారిగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల డైరెక్టర్ మన్యం అరవింద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సమాజానికి నాణ్యత, ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలనే సంకల్పంతో కళాశాల ఛైర్మన్ రామిరెడ్డి 2008వ సంవత్సరంలో శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలను ప్రారంభించారన్నారు. మంచి విలువలతో కూడిన విద్యను అందించడంలో సఫలీకతమయ్యామన్నారు. తద్వారా శ్రీరామ కళాశాలలో విద్యను అభ్యసించిన ఎంతోమంది దేశ, విదేశాల్లో బహుళ జాతి కంపెనీల్లో రాణించడం, మరి కొంతమంది స్వీయ కంపెనీలను స్థాపించి స్థిరపడడం చాలా సంతోషంగా ఉందన్నారు. చాలా కాలం తర్వాత పూర్వ విద్యార్థులు ఇలా ఒక వేదికపై నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని అధ్యాపకులతో మాట్లాడుకోవడం కనుల విందుగా ఉందన్నారు. అనంతరం దాదాపు 150 మంది పూర్వ విద్యార్థులు తమ తరగతి గదులలో కలియ తిరుగుతూ నాటి జ్ఞాపకాలను తోటి స్నేహితులతో నెమరు వేసుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ కె. జయచంద్ర మాట్లాడుతూ శ్రీరామ కళాశాలలో అందిస్తున్న విలువలతో కూడిన విద్యతో విద్యార్థుల లక్ష్యాలకు బాటలు వేస్తుందనడానికి పూర్వ విద్యార్థులు సాధించిన ఘనతే నిదర్శనమన్నారు. కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్ మన్నెం రామసుబ్బారెడ్డి, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులు సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ అన్నారు. శనివారం మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీ గ్రామపంచాయతీలో గల శ్రీనివాస హైస్కూల్ లో పాఠశాల అధినేత సుబ్రహ్మణ్యం రాజు ఆధ్వర్యంలో సైన్స్ ఫెయిర్ ను ఏర్పాటు చేశారు. ఈ సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ హాజరై విద్యార్థులు తయారుచేసిన 150 రకాల పరిశోధనలను పరిశీలించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాల్య విద్యాదశ నుండి నేర్చుకుంటున్న సైన్స్ పరిశోధనలను ప్రదర్శన చేయడంతో మరింత విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దబడతారని అన్నారు. శ్రీనివాస హైస్కూల్లో ప్రీ ప్రైమరీ పిల్లలూ చక్కటి అంశాలు ఎంచుకొని వాటిని వివరించడంతో ఆయన సంతప్తి వ్యక్తం చేశారు. 30 పాఠశాలల అధినేతలు సైన్స్ ఫెయిర్ ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ప్రభాకరరాజు, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని పిల్లలు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు.

గుర్తుతెలియని వాహనాలతో ప్రమాదాలు జరిగినా నష్టపరిహారం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: గుర్తుతెలియని వాహనాలతో ప్రమాదాలు జరిగినా నష్టపరిహారం పొందవచ్చునని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర పేర్కొన్నారు. స్థానిక కోర్టు ఆవరణంలో రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు మోటారు వాహన సవరణ చట్టం, నియమాలు 2022 పై పోలీసు అధికారులకు, న్యాయవాదులకు, ఇన్సూరెన్స్ అధికారులకు మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ ఎవరైనా వాహనంతో ప్రమాదం చేసి తప్పించుకొని వెళ్లినా బాధితుడు కోర్టు ద్వారా నష్టపరిహారం పొందవచ్చునన్నారు. పోలీసు అధికారులు మొదటగా యాక్సిడెంట్ రిపోర్ట్ 48 గంటల లోగా సమర్పించాలన్నారు. ప్రమాదానికి గురైన వాహనాన్ని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పోలీస్ అధికారులతో కలిసి వాహనాన్ని తనిఖీ చేసి దాని వివరాలు వాహన రిజిస్ట్రేషన్ తదితర అంశాలను సమగ్రంగా సమర్పించాలన్నారు. అనంతరం పుత్తూరు సివిల్ జడ్జి లీలా శ్యాంసుందరి మాట్లాడుతూ ప్రమాదాల వల్ల కలిగే నష్ట పరిహారాన్ని ఎలా పొందాలనే అంశంపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామాంజనేయులు, సీఐ లక్ష్మీనారాయణ, దస్తగిరి, కార్వేటినగరం పోలీసులు, న్యాయవాదులు, అధికారులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

ప్రజాశక్తి-కెవిబి పురం: గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని పశువైద్యాధికారి డాక్టర్ గుణశేఖర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కోవనూరు గ్రామంలో సర్పంచి పెంచలయ్య ఆధ్వర్యంలోజాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా పశువైద్య శిబిరంలో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గుణశేఖర్ మాట్లాడుతూ ఎండాకాలంలో దూడ, ఆవులకు తీవ్రమైన జ్వరం, నీరసం, కొద్దిపాటి ఎండకు రొప్పడం, చూడి పశువులు ఈసుకుపోవడం, ఎద్దులలో పని సామర్థ్యం తగ్గటం వంటివి వ్యాధి వల్ల కలిగే నష్టాలని తెలిపారు. పాల ఉత్పత్తి, పని సామర్థ్యం గణనీయంగా తగ్గిపోవడం రైతుకు ఆర్థిక నష్టమన్నారు. వైద్యం నిర్లక్ష్యం చేస్తే పశువులు చనిపోతాయని తెలిపారు. గాలికుంటు వ్యాధి సోకిన మగ పశువుల్లో తగ్గే పని సామర్థ్యాన్ని పూర్తిగా నివారించవచ్చన్నారు. దూడల్లో మరణాలు తగ్గించి, ఆరోగ్యంగా ఎదగడానికి ఈ టీకాలు ఉపయోగపడతాయని తెలిపారు. పశువుల గుర్తింపునకు చెవిపోగు వేయటంతో రైతులకు ప్రభుత్వ పథకాల లబ్ది చేకూరుతుందన్నారు. మా పశువైద్య సిబ్బంది గ్రామాల్లో సంచరిస్తూ రైతుల ఇంటిముంగిటనే ఉచితంగా టీకాలను వేస్తారని తెలిపారు. రైతన్నలు మా సిబ్బందికి సహకరించి మీ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసుకోవడంతో వ్యాధి వల్ల కలిగే నష్టాలను నివారించుకోవచ్చన్నారు.

ఘనంగా సంగీత నృత్య కళాశాలలో అన్నమాచార్య వర్ధంతి వేడుకలు

ప్రజాశక్తి - క్యాంపస్ : పద కవితా పితామహుడు, ద్రావిడగామా సార్వభౌముడు, సంకీర్తన ఆచార్యులు తొలి తెలుగు వాగేకారుడు శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల వారి 520 వ వర్ధంతి శ్రీ వేంకటేశ్వర సంగీత, నత్య కళాశాలలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిదిన్నర గంటలకు కళాశాలలోని అన్నమాచార్య విగ్రహానికి పూజాది కార్యక్రమాలు నిర్వహించి అక్కడి నుంచి అన్నమాచార్య చిత్రపటంతో కళాశాల ప్రార్థన మందిరం వరకు ఊరేగింపు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి ఎం ఉమా ముద్దుబాల మాట్లాడుతూ ప్రాచీన సాహిత్యంలో శ్రీ వెంకటేశ్వరుని సాహిత్యం పై పద కవితలు, పాటలు కూర్చీ గానం చేసిన ఏకైక నిరంతర భక్తుడు అన్నమాచార్యుల వారని కీర్తించారు. ఆయన కీర్తనలతో స్వామివారి ప్రతిరోజు ఉదయం దర్శనం ప్రారంభమై సాయంత్రం పవళించే వారిని కొనియాడారు. స్వామివారికి ఎంతో అత్యంత ప్రీతిప్రాతమైన అన్నమాచార్యుల యొక్క వర్ధంతి మన కళాశాలలో జరుపుకోవడం విద్యార్థులకు ఎంతో సంతోషదాయ కమన్నారు. అన్నమాచార్య సంకీర్తనలను కళాశాల అధ్యాప కులు విద్యార్థులు, విద్యార్థులు గానాలతో ఆలపించారు. సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల సంబరాలు

ప్రజాశక్తి-గూడూరు: తెలుగుదేశంపార్టీ బలపరచిన ఎంఎల్‌సి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ విజయం సాధించడంతో శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు సంబరాల్లో మునిగిపోయారు. ఈ సందర్భంగా టపాకాయలు పేల్చి, భారీ కేకును కట్ చేసి, స్వీట్లు పంచుకున్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేణిగుంట: తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించిన పట్టభద్రులకు పాదాభివందనమని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా అన్నారు. శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి తెలుగు తమ్ముళ్లు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అక్కడ నుండి ర్యాలీగా అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రేణిగుంట క్లస్టర్ ఇన్‌ఛార్జ్ పుష్ప నాదం తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: శాసనమండలి ఎన్నికల్లో టీడీపీకి అండగా నిలిచిన పట్టభద్రులు, కార్యకర్తలు, నేతలకు అందరికీ పాదాభివందనమని ఆ పార్టీ స్థానిక నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ బలపరచిన అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ 38 వేలకు పైగా మెజార్టీతో విజయం సాధించిన నేపథ్యంలో శనివారం స్థానికంగా ఆ పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: తూర్పు రాయలసీమ పట్టభద్రులఎమ్మెల్సీ స్థానాలలో తెలుగుదేశం అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ భారీ మెజార్టీతో గెలుపొందడంతో నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గాలి భాను ప్రకాష్ ఆదేశాల మేరకు పుత్తూరు పట్టణ పార్టీ అధ్యక్షులు జీవరత్నం నాయుడు ఆధ్వర్యంలో బాణసంచా కాలుస్తూ, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

తిరుపతి(మంగళం): తూర్పు రాయలసీమ, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులు ఘన విజయం సాధించడంతో మంగళం పరిధిలోని ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీకి టిడిపి నాయకులు ఈశ్వరయ్య, గోపి, పెరుగు భాస్కర్ రెడ్డి, చలపతి, చంద్ర, సురేష్ నాయుడు, సురేష్, ఉమా మహేశ్వరి తదితరులు విజయోత్సవ బైక్ ర్యాలీని నిర్వహించారు.

హాస్పిటల్‌ను ప్రారంభించిన చెవిరెడ్డి మోహిత్

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి భాకరాపేటలోని ఎమ్మెల్యే కార్యాలయం ఎదురుగా కొత్తగా నిర్మించిన హరిప్రియ మెడికేర్ హాస్పిటల్ ను శనివారం ప్రారంభించారు. సర్పంచ్ సాకిరి భూపాల్, నాయకులు టి.గురుశంకర్ దేవప్రసాద్, మునిరామ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ నిత్యాన్నదాన పథకానికి మదనపల్లికి చెందిన ప్రభాకర్ కుటుంబం రూ.30 వేలు విరాళంగా శనివారం అందజేశారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో పాలకమండలి ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేసి, అన్నదాన పథకానికి ఖర్చు చేయాల్సిందిగా కోరారు.

కోదండ రాముని ధ్వజ స్తంభ ప్రతిష్ట

ప్రజాశక్తి-కోట: మండలంలోని చిట్టేడు గ్రామంలో వెలసిన శ్రీ సీత సమేత కోదండ రామస్వామి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం వేద పండితుల ప్రత్యేక పూజా కార్యక్రమాల మధ్య శనివారం నిర్వహించారు. భగవత్ప్రార్ధనం, అగ్ని ప్రణయనం, కుంభారాదనం, ఉక్తహోమాలు, మహాశాంతి హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

రామ్‌రాజ్ థియేటర్ ఎదురు వీధిలో మురికినీరు

ప్రజాశక్తి-కోట: మండలంలోని రామ్‌రాజ్ థియేటర్ ఎదురు వీధిలో శనివారం అకస్మాత్తుగా పడ్డ వర్షానికి నీరు చేరడంతో డ్రైనేజీలోని మురికినీరు రోడ్డుపైకి వచ్చాయి. స్థానికులు మురికినీటి వాసనతో ఇబ్బంది పడ్డారు. పంచాయతీ అధికారులు తక్షణమే డ్రైనేజీ కాలువలోని చెత్తాచెదారాన్ని శుభ్రం చేసి మురికినీరు నిల్వలేకుండా చూడాలని స్థానికులు తెలిపారు.

తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా మెలగాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు మెలగాలని, చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉండాలని అలిపిరి సీఐ అబ్బన్న విద్యార్థులకు సూచించారు. శనివారం మంగళం పరిధిలో గల విద్యార్థులు బస చేసే ప్రైవేటు హాస్టళ్లలో సాధారణ తనిఖీలు నిర్వహించి, మత్తు పదార్థాల దూరంగా ఉండాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అలిపిరి ఎస్సై నరసింహారావు, బ్లూ కోల్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

స్థానికులు పసిగట్టడంతో పరార్

ప్రజాశకి-తిరుపతి సిటీ: ఓ ఏటీఎంను కొళ్లగొట్టేందుకు కొంతమంది గుర్తు తెలియని దుండగులు ప్రయత్నం చేశారు. స్థానికులు గమనించడంతో ఉడాయించిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు తిరుపతి హరే రామ హరే కష్ణ రోడ్డులోని టీటీడీ మైదానం సమీపంలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలోకి కొంతమంది గుర్తు తెలియని దుండగులు ప్రవేశించారు. ఏటీఎంను పగలగొట్టి డబ్బును దోచుకెళ్లేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. ఏటీఎంను పగలగొట్టేందుకు పూనుకోడంతో శబ్దాన్ని గమనించిన స్థానికులు గట్టిగ కేకలు వేస్తూ ఏటీఎం వద్దకు చేరుకున్నారు. దీంతో దుండగులు అక్కడనుంచి పరారయ్యారు. స్థానికుల సమాచారం తో అలిపిరి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకు న్నారు. నిందితులను గుర్తించేందుకు వేలి ముద్రలు సేకరించి సీసీ కెమెరాలు పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఉగాది ఉత్సవ సభ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన ఉగాది ఉత్సవ సభను నిర్వహించనున్నట్లు ఆ సమితి అధ్యక్షురాలు గంగవరపు శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ వి సెనేట్ హాల్లో జరిగే కార్యక్రమంలో ఇటీవల నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలందరూ విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.

ధనంజయ రెడ్డిని కలిసిన వైసీపీ నేత

ప్రజాశక్తి-కోట: పట్టణంలో ప్రధాన సమస్యగా కోట పంట కాలువ అభివృద్ధికి త్వరలోనే మోక్షం లభించే అవకాశం ఉంది. కోటలో ఉన్న పంట కాలువ ఆక్రమణకు గురికావడంతో పంట కాలువలో నీటి పారుదల లేకపోవడంతో పంట కాలువలు కాస్తా డ్రైనేజీ గుంటలుగా మారడంతో దోమలకు పుట్టినిల్లుగా, మురికి గుంటలు అవడంతో దుర్భరకరమైన వాసనలు రావడంతో పందులకు నిలయంగా మారడంతో కోట ప్రజలు ఏళ్ల నుండి నరకయాతన అనుభవిస్తున్నారు. దీంతో కోట పట్టణానికి చెందిన వైసీపీ నేత నల్లపరెడ్డి వినోద్ రెడ్డి పంట కాలువ అభివృద్ధికి కృషిచేస్తున్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): నెల్లూరు జిల్లా కావలి ఫారెస్ట్ బీటు పరిధిలో ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేసి 28 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు శనివారం తెలిపారు. టాస్క్ ఫోర్స్ కార్యాలయం తెలిపిన వివరాల మేరకు ఎస్పీ కె.చక్రవర్తి ఆదేశాలతో డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో ఆర్ఐ కపానంద ఆధీనంలోని ఆర్ఎస్ఐ ఆలీ భాషా బందం రాపూరు నుండి తనిఖీలు చేపట్టారన్నారు. నెల్లూరు జిల్లా కావలి వద్ద అన్నపూర్ణ రైస్ మిల్లు సమీపంలో కొందరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారని వారి వద్దకు చేరుకుంటుండగా ముగ్గురు వ్యక్తులు పారిపోగా ముగ్గురిని పట్టుకున్నామన్నారు. వారికి సమీపంలోనే డంప్ ఉన్నట్లు గుర్తించి అక్కడున్న 28 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన వారు నెల్లూరు టౌన్‌కు చెందిన గల్లా ఉదయ భాస్కర్ (57), బద్వేలుకు చెందిన అబ్బు భాస్కర్ (39), బాలపల్లికి చెందిన రియాజ్ (29)లుగా గుర్తించామన్నారు. పరారీలో ఉన్న ఏర్పేడుకు చెందిన మణి, సుధాకర్, రైల్వే కోడూరుకు చెందిన దశరథ నాయుడు కోసం గాలిస్తున్నామన్నారు. పట్టుబడిన ఎర్రచందనం దుంగలు 816 కిలోలు ఉన్నాయని, రూ.75 లక్షల విలువ ఉంటుందని డీఎస్పీ తెలిపారు. ఈ కేసును సిఐ చంద్రశేఖర్ దర్యాప్తు చేస్తున్నారన్నారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న టాస్క్ ఫోర్స్ అధికారులను డీఐజీ సెంథిల్ కుమార్ అభినందించి రివార్డ్స్ ప్రకటించినట్లు తెలిపారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో ఆదివారం జరగనున్న సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 23వ తేదీకి వాయిదా వేసినట్లు ఎంపీడీఓ త్రివిక్రమ రావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ముఖ్య అతిథిగా సత్యవేడు నియోజకవర్గం శాసన సభ్యులు కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో మండలంలోని సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు జడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సందర్శన

ప్రజాశక్తి-రేణిగుంట: పిల్లలందరికీ సక్రమంగా టీకాలు వేయించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి శాంతి కుమారి తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఇమ్యునైజేషన్ సెట్స్ ను డాక్టర్ శాంత్ కుమారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు పుట్టిన వెంటనే వేసే టీకా నుండి ప్రతి టీకాను తప్పకుండా వేయించాలన్నారు. టీకాలకు సంబంధించిన రిజిస్టరును పరిశీలించారు. వైద్యాధి కారిని శ్వేత, సూపర్‌వైజర్ మురళి, ఎఎన్ఎం జ్యోతి రాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్యాణ వేంకన్న పుష్పయాగం సప్తవర్ణశోభితం



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వైభవంగా పుష్పయాగం జరిగింది. ఆలయంలో ఫిబ్రవరి 14 నుంచి 22వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరిగిన విషయం తెలిసిందే. ఈ బ్రహ్మోత్సవాల్లో అర్చక పరిచారకులు, అధికార అనధికారులు, భక్తుల వల్ల తెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహిస్తారు. ఈ యాగం నిర్వహణతో సమస్తదోషాలు తొలగిపోతాయని అర్చకులు తెలిపారు. ఇందులో తులసి, చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, రోజా, కలువలు వంటి 12 రకాల పూలు, ఆరు రకాల ఆకులు కలిపి మొత్తం 3.5 టన్నుల పుష్పాలతో స్వామి, అమ్మవార్లకు యాగం నిర్వహించారు. ఈ పుష్పయాగ మహోత్సవాన్ని చూసి భక్తులు తన్మయత్వం చెందారు. తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి దాతలు ఈ పుష్పాలు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, గార్డెన్ మేనేజర్ జనార్దన్ రెడ్డి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, అర్చకులు బాలాజి రంగాచార్యులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్రిబిజినెస్ ఇంకుబేటర్ శిక్షణ

ప్రజాశక్తి-క్యాంపస్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అగ్రి బిజినెస్ ఇంకుబేటర్ నిర్వహించిన రెండు నెలల శిక్షణ కార్యక్రమం ముగింపు సభలో వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు సి.రమణ, శ్రీ వేంకటేశ్వర పశుసంవర్ధక శ్రీ విద్యాలయ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ జి.వెంకట నాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం సి.రమణ మాట్లాడుతూ ప్రాంతాల నుండి వినూత్నమైన ఆలోచనలతో వచ్చిన ఔత్సాహికులు ఈ రెండు నెలల శిక్షణ కార్యక్రమంలో తమ ఆలోచనలకు ఒక రూపాన్ని తీసుకువచ్చి బిజినెస్ మాడల్‌గా మలుచుకోవడానికి ఎంతో దోహదం చేసి ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జాతీయ కమిటీ ముందు వారి వారి వినూత్న ఆలోచనలను మంచిగా వ్యక్తపరిచి ఈ పథకం ద్వారా గ్రాంటును పొందవలసిందిగా కోరారు. ముఖ్య అతిథి డాక్టర్ జి. వెంకటనాయుడు మాట్లాడుతూ శాస్త్రవేత్తల ద్వారా వచ్చిన టెక్నాలజీయే కాకుండా రైతులు విద్యార్థుల నుంచి వచ్చిన సజనాత్మక ఆలోచనల ద్వారా కూడా వ్యవసాయం, అనుబంధ రంగాల అభివద్ధికి ఎంతో తోడ్పాటు నిస్తుందని ఆయన తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఔత్సాహికులకు అందరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అగ్రి బిజినెస్ ఇంకుబేటర్ ప్రధాన శాస్త్రవేత్త పి.బాలహుస్సేన్ రెడ్డి, స్మార్ట్ స్టెప్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనాథ్ రాజు, బిజినెస్ మేనేజర్ నరేష్ రెడ్డి, లక్ష్మీ తులసి, సంతోష్, రమాదేవి పాల్గొన్నారు.

వరాల గంగమ్మ ప్రథమ వార్షికోత్సవ పూజలు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలం తిరుమణ్యం పంచాయతీ రాజుల కండ్రిగ గ్రామంలోని నాగలక్ష్మి దేవి ఆలయంలో ఉన్న వరాల గంగమ్మ ప్రథమ వార్షికోత్సవ పూజలు గ్రామస్తులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ వరాల గంగమ్మ కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంగా గ్రామంలో అవతరించారని, అమ్మవారిని పూజిస్తే శుభాలు కలుగుతాయన్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేపట్టారు.